# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే బీరం సతీమణి విజయమ్మ
- పెంట్లవెల్లి మండల బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి హాజరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సతీమణి బీరం విజయమ్మ



ఆత్మీయ సమేళనానికి భారీగా హాజరైన కార్యకర్తలు

పెంట్లవెల్లి, అక్టోబర్ 31: కొల్లాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధిని చూసి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని మరోమారు ఆదరించాలని ఎమ్మెల్యే బీరం సతీమణి విజయమ్మ కోరారు. అభివృద్ధి కోసం ఇచ్చినమాట ప్రకారం సీఎం కేసీఆర్ సహకారంతో అభివృద్ధి చేశారని, రానున్న ఎన్నికల్లో మరోమారు కారు గుర్తుకు ఓటు వేసి, వేయించి ఆశీర్వదించాలని అన్నారు. మంగళవారం పెంట్లవెల్లిలో బీఆర్ఎస్ పార్టీ మండల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సతీమణి బీరం విజయమ్మ విచ్చేసి మాట్లాడారు. చిన్నపాటి వర్షం వస్తే నదీతీర గ్రామాలైన మల్లేశ్వరం, వేంకల్,ఎంగంపల్లితండా గ్రామాలు సమీపంలోని వాగుపై రాకపోకలు సాగించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పెంట్లవెల్లికి వెళ్లేవారని, ఎమ్మెల్యే బీరం గత ఎన్నికల ప్రచారం కోసం వచ్చినప్పుడు స్వయంగా గమనించి, ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే వంతెన నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం కేసీఆర్ సహకారంతో పంచాయతీ రాజ్ శాఖ నిధుల నుంచి రూ.9.65లక్షలు మంజూరు చేయించి చెక్‌డ్యాంతో పాటు హైలెవల్ వంతెన నిర్మించి ప్రారంభోత్సవం చేశారన్నారు. అంతేగాక గ్రామ సమీపంలో ప్రవహిస్తున్న కృష్ణానది తీరం నుంచి సాగునీరు అందనిద్రాక్షగా మల్లేశ్వరం గ్రామంతో పాటు వేంకల్,ఎంగంపల్లి తండా గ్రామాలకు మిగిలిపోయిందని, బీడువారిన పొలాలకు సాగునీరు అందించేందుకు సీఎం కేసీఆర్ సహకారంతో రూ.31,50కోట్లతో మినీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను నిర్మించేందుకు నిధులు మంజూరు చేయించి, జీవో కాపీతో శంకుస్థాపన చేశారని అన్నారు. 19 ఏండ్లపాటు ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న జూపల్లి కృష్ణారావు నియోజకవర్గాని అభివృద్ధిచేయలేక పోయారని మండిపడ్డారు. మండల కేంద్రం సమీపంలోని చౌట చెరువు కట్టను వెడల్పుతో పాటు,మల్లేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌తో పాటు,ఎంగంపల్లితండా వాగుపై వంతెన నిర్మించమని గ్రామస్తులు అడిగితే అదిగో ఆర్డర్‌కాఫి అంటూ ప్రజలను మేసం చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యేగా బీరం హర్షవర్ధన్‌రెడ్డి గెలిచిన ఐదేండ్లలో రెండేండ్లు కరోనా మహమ్మారితో సరిపెట్టుకోగా, కేవలం మూడేండ్లలోనే పెంట్లవెల్లి మండలంతోపాటు, కొల్లాపూర్ నియోజకవర్గాని అభివృద్ధిలో పలురుగులు పెట్టించారన్నారు. మరోమారు రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే బీరంను అత్యధిక మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించాలని కార్యకర్తలను కోరారు. మంచాలకట్టలో కల్యాణ మండపం నిర్మాణం, మండల కేంద్రం సమీపంలో 33/11కేవి సబ్‌స్టేషన్, శింగవరం, గోప్లాపురం, పెంట్లవెల్లిలో రైతులకు సాగునీరు అందించేందుకు చెక్‌డ్యాం నిర్మాణాలు.. ఇలా చాలాపనులు చేశారన్నారు. అనంతరం సమావేశానికి వచ్చిన కార్యకర్తలకు స్వయంగా అన్నం వడ్డించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు రాజేశ్, సురేందర్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు పోతుల వేంకటేశ్వర్లు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గోవురాజు, జిల్లా కోఆప్షన్ సభ్యులు మతీన్, సింగిల్‌విండో చైర్మన్ విజయరామారావు, జటప్రోల్, మంచాలకట్ట,మల్లేశ్వరం,మాధవస్వామినగర్ గ్రామాల సర్పంచులు ఎస్‌కే ఖాజా, విజయ్, నాగరాజు, మండల కోఆప్షన్ సభ్యులు అబ్దుల్‌హుస్సేన్,కొల్లాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రామకృష్ణ,రఫి, మాజీ ఎంపీపీలు నరేందర్‌రెడి, హన్మంత్, నాయకులు రమణయాదవ్, శేషేంద్రప్రసాద్, రామకృష్ణ, పల్లెనాగరాజు, భాస్కర్‌గౌడ్, యాగౌస్, విష్ణుగౌడ్ ఉన్నారు.

## సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తాం

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 31: మండలంలోని అన్ని గ్రామాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు, కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గణేశ్‌రావు తెలిపారు. గ్రామాల్లో బీఆర్ఎస్‌కు ఆదరణ పెరిగిందని, వివిధ పార్టీల నుంచి భారీగా చేరుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్‌లో చేరే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇస్తున్నామన్నారు. మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉండేందుకు కొల్లాపూర్‌లో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



పాన్‌గల్‌లో మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి

పాన్‌గల్, అక్టోబర్ 31: మండల కేంద్రానికి చెందిన ఆదిరాజు(49) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, వారి కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణ సాయంగా కుటుంబ సభ్యులకు ఎంపీపీ రూ.5వేలు అందించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తిరుపతయ్య, మాజీసర్పంచ్ చంద్రయ్య, ఆదిహనుమంతు పాల్గొన్నారు.

## వైద్యం కోసం ఆర్థికసాయం



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న రామకృష్ణ తదితరులు

కోడేరు, అక్టోబర్ 31: మండల కేంద్రానికి చెందిన నేరెడుగొమ్ము మంగలిసత్యంకు ఆర్కే సంస్థ సహాయనిధి నుంచి మంగళవారం రూ.20వేల సాయం అందించారు. మంగలి సత్యంకు రెండు కాళ్లు ఇన్‌ఫెక్షన్ సోకి మంచానికే పరిమితం కావటంతో వైద్యం కోసం ఆర్కే సంస్థ సహాయనిధి నుంచి నగదును అందజేశామని కొమిరే రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో అంజి, శ్రీకాంత్, మల్లేశ్, బాలకృష్ణ, జమాల్‌పాష, ఖమర్ పాల్గొన్నారు.

## వందశాతం నమోదు చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ నాగరాజు తదితరులు

పాన్‌గల్, అక్టోబర్31: గ్రామాల్లో గర్భవతులను గుర్తించి, వివరాలు కచ్చితంగా నమోదు చేయడంతోపాటు క్రమంతప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహించాలని డాక్టర్ నాగరాజు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గర్భిణులకు ప్రభుత్వ దవాఖానలోనే ప్రసవాలు జరిపించాలని కోరారు. పుట్టిన చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు వేయించాలని కోరారు. అర్హులైన వారికి కేసీఆర్ కిట్టును అందించాలని, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. సమావేశంలో సిబ్బంది శ్రీనివాస్, సంతోషమ్మ, సుమనశ్రీ పాల్గొన్నారు.

## గిరిజన సంస్కృతిని కాపాడుకుందాం

పాన్‌గల్, అక్టోబర్31: తరతరాలు వస్తున్న గిరిజన సంస్కృతిని కాపాడుకోవాలని, కావలసిన నిధులు ప్రభుత్వం కేటాయించాలని సర్పంచ్ శాంతమ్మ కోరారు. మంగళవారం మండలంలోని తెల్లరాళ్లపల్లి తండాలో నూతనంగా నిర్మించిన భవనానికి పూజలు చేశారు. అనంతరం ఆడిపాడారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బాల్యానాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోమ్‌నాథ్‌నాయక్, ఎంపీవో రఘురామ్, వాల్యానాయక్, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.



తెల్లరాళ్లపల్లితండాలో సర్పంచ్ శాంతమ్మను సన్మానిస్తున్న గిరిజనులు

## ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు అవగాహన

వీపనగండ్ల, అక్టోబర్ 31: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 3, 6, 9వ తరగతి విద్యార్థులకు లాంగ్వేజ్, గణితంలో సామర్థ్యాలను అంచనా వేసేందుకు నవంబర్ 3న నిర్వహించనున్న పరీక్షలపై చిన్నంబావి, వీపనగండ్ల మండలాల ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మణ్ నాయక్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వీపనగండ్లలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## మరోసారి గెలిపించుకుందాం

- ఎంపీపీ సోమేశ్వరమ్మ

చిన్నంబావి, అక్టోబర్ 31: నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ఎంతో అభివృద్ధి చేశారని, ఆయనను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఎంపీపీ సోమేశ్వరమ్మ మం డల ప్రజలను కోరారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభు త్వ పథకాలను, ఎన్నికల మ్యానిఫెస్టోను , అభివృద్ధిని ప్రతి కార్యకర్త గ్రామాల్లో ప్రతి గడపకు తీసుకెళ్లాలన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కలిసి పనిచేయాలన్నారు.

## నామినేషన్లపై నేడు అవగాహన

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 31: ఎన్నికల నామినేషన్లపై రాజకీయ పార్టీల నాయకులకు కొల్లాపూర్‌లోని తాసీల్దార్ కార్యాలయంలో నవంబర్ 1న అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తాసీల్దార్ యూసుఫ్‌అలీ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరుకావాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి పాల్గొంటారని, నామినేషన్లు వేసే ప్రక్రియపై సూచనలు సలహాలు అందిస్తారన్నారు.

## పాత సన్నబియ్యం వేలం

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 31: మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో వచ్చే నెల 2న పాత సన్నబియ్యం వేలం వేస్తున్నట్లు మండల విద్యాధికారి చంద్రుడు ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు కేంద్రంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

## విద్యార్థులకు వైద్యపరీక్షలు

పాన్‌గల్, అక్టోబర్ 31: జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ హరీశ్ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని కోరారు. పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రకాశంశెట్టి, సుదర్శన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

## కాల్వకు నీళ్లు వదిలి పంటలను కాపాడండి

పాన్‌గల్, అక్టోబర్31: కేఎల్‌ఐ కాల్వలకు నీళ్లు వదిలి ఎండిపోతున్న పంటలను కాపాడాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బాలస్వామి కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కొన్ని రోజులుగా కాల్వలకు నీరు రావడంలేదని, బోర్లు, బావులు ఉన్నవాళ్లు వాటి ద్వారా పంటలను కాపాడుకుంటున్నారని, లేని వారి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాల్వలను నమ్మి పంటలు వేసుకున్నారని, 20 నుంచి 30 రోజులు వరకు సాగునీరు అందిస్తే పంటలు చేతికి వస్తాయని చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.